సాక్షి
రంగారెడ్డి
గురువారం । 10 । అక్టోబర్ । 2024



మడిగెలకు మోక్షమెప్పుడో

'పట్నం' వ్యవసాయ మార్కెట్‌లో 2022లో రూ.1.25కోట్లతో 17 మడిగల నిర్మాణ పనులు ప్రారంభించారు. 10లో▸



పేదల ఆరోగ్యానికి పెద్దపీట

పేదల ఆరోగ్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. 10లో▸



ప్రతిపక్షాలది దుష్ప్రచారం

కాంగ్రెస్ ప్రజాపాలన అందిస్తుంటే ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. 10లో▸

న్యూస్‌రీల్

వ్యవసాయ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ముదిరెడ్డి కోదండరెడ్డి, చిత్రంలో అన్వేశ్‌రెడ్డి

యాచారం: రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్‌గా ముదిరెడ్డి కోదండరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. తనకు కేటాయించిన ప్రభుత్వ భవనంలో మరమ్మతులు కొనసాగుతున్నందున దసరా పండుగ నేపథ్యంలో బుధవారం మంచిరోజు ఉండడంతో నగరంలోని బూర్గుల రామకృష్ణారావు భవనంలో రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. మండల కేంద్రానికి చెందిన కోదండరెడ్డి గతంలో ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా, హుడా చైర్మన్‌గా పనిచేశారు. కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడిగా, ప్రస్తుతం ఆయన ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడిగా సేవలు అందిస్తున్నాడు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లాలో 19,333 ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటుకు సంకల్పించగా.. దాన్ని రద్దు చేయించే విషయంలో కోదండరెడ్డి కీలకంగా వ్యవహరించాడు. రేవంత్‌రెడ్డి సర్కార్ అదే భూముల్లో ఫ్యూచర్‌సిటీని ఏర్పాటుకు సంకల్పించింది. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి, సీనియర్ నాయకుడు అంగోత్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మామూళ్లు అడిగిన ఐదుగురిపై కేసు

శంకర్‌పల్లి: దసరా మామూళ్లు ఇవ్వాలంటూ ఓ ఆస్పత్రి యాజమాన్యంతో గొడవపడిన ఐదుగురు డిజిటల్ మీడియా రిపోర్టర్లపై కేసు నమోదైనట్లు సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. దసరా మామూళ్ల కోసం మంగళవారం సాయంత్రం పట్టణంలోని ఓ నర్సింగ్ హోమ్‌కు వెళ్లిన డిజిటల్ మీడియా రిపోర్టర్లు రూ.10 వేలు ఇవ్వాలని ఆస్పత్రి నిర్వాహకుడిని డిమాండ్ చేశారు. ఇందుకు ఆయన నిరాకరించడంతో యాజమాన్యం గుర్తింపు రద్దు చేయిస్తామని, అవకతవలు బయట పెడుతామని బెదిరించారు. దీంతో సదరు డాక్టర్ సీసీటీవీ ఫుటేజీలతో వెళ్లి శంకర్‌పల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

20న కేబీఆర్ పార్కులో 'ప్రజా సంబరాలు'

లక్డీకాపూల్: తెలంగాణ సంస్కృతి, వారసత్వ సంపద తెలిసేలా ప్రజా సంబరాలు నిర్వహిస్తున్నట్లు నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. ఈ నెల 20న కేబీఆర్ పార్కులో ప్రజా సంబరాలు పేరిట సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన పోస్టర్‌ను జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా మన సంస్కృతి, వారసత్వ సంపద తెలిసేలా ప్రజా సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో నగర అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు సూచనలు చేశారన్నారు. నగర సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, గ్రీనరీ వంటి అంశాలపై ఆయన ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారని చెప్పారు. నగర సుందరీకరణలో భాగంగా పార్కుల అభివృద్ధి, సెంట్రల్ మీడియన్, గ్రీనరీ పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నెల 20న కేబీఆర్ పార్కులో పోటీలు ఏర్పాటు చేశామన్నారు. అడిషనల్ కమిషనర్లు నళినీ పద్మావతి, పంకజ, వేణుగోపాల్ రెడ్డి, చీఫ్ అర్బికల్చర్ ఆఫీసర్ సునంద, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి పాల్గొన్నారు.

10 ఏళ్లలో చెరువులు మాయం

ఆక్రమణదారుల చెరలో మరికొన్ని చెరువులు

- పుప్పాల్‌గూడ చెరువులో భారీ బహుళ అంతస్తుల నిర్మాణం
- టీజీఆర్‌ఏసీ సర్వేలో విస్తుగొలిపే అంశాలు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లాలో అనేక చెరువులు, కుంటలు కబ్జా దారుల చేతుల్లో చిక్కి పూర్తిగా ఆనవాళ్లు కోల్పోయాయి. కంటికి రెప్పలా కాపాడాల్సిన ఇరిగేషన్, రెవెన్యూ, సర్వే, ఇతర శాఖల అధికారులు అక్రమార్కులకు అండగా నిలవడంతోనే ఈ దుస్థితి దాపురించింది. చెరువులు, కుంటల పరిరక్షణ కోసం ప్రభుత్వం హైడ్రా ను ఏర్పాటు చేసింది. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో వెలిసిన అనేక నిర్మాణాలను ఇప్పటికే కూల్చివేసింది. హెచ్‌ఎండీఏ పరిధిలోని చెరువులు, కుంటలపై సర్వేకు ఆదేశించింది. ఇందులో భాగంగా ఇప్పటికే అవుటర్ లోపలున్న 920 చెరువులపై తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్ సర్వే చేపట్టింది. దీనిపై ఇటీవలే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు నివేదికను అందజేసింది. ఇందులో విస్తుగొలిపే అంశాలు అనేకం వెలుగు చూశాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత 225 చెరువులు పూర్తిగా.. 196 చెరువులు పాక్షికంగా ఆక్రమణకు గురైనట్లు స్పష్టం చేసింది. జిల్లాలోని బాలాపూర్, అబ్దుల్లాపూర్‌మెట్, గండిపేట, శేరిలింగంపల్లి, హయత్‌నగర్, రాజేంద్రనగర్ మండలాల్లోనే ఉన్నట్లు తేలింది. పుప్పాల్‌గూడ చెరువులో ఏకంగా ఓ రియల్ ఎస్టేట్ సంస్థ యాభైకిపైగా అంతస్తుల భవనాన్ని నిర్మిస్తుండటం గమనార్హం. గడిచిన పదేళ్లలో జిల్లా వ్యాప్తంగా పది చెరువులు పూర్తిగా కనుమరుగయ్యాయి. కబ్జాదారుల చెరలో బందీ అయిన ఈ చెరువులకు హైడ్రా విముక్తి కలిగిస్తుందా? అంటే వేచి చూడాల్సిందే.

అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలో..

కుంట్లూరు రెవెన్యూలో 2.88 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన చెన్‌కుంట(ఐడీ నంబర్ 818)లోని 21 శాతానికిపైగా కబ్జాకు గురైంది. 2014కు ముందు ఇక్కడ ఎలాంటి ఆక్రమణలు, నిర్మాణాలు లేవు. 2014 తర్వాత ఇందులో పలు నిర్మాణాలు చేపట్టారు. కుంట్లూరు చెరువు 1.62 ఎకరాల విస్తీర్ణం(ట్యాంక్ ఐడీ నంబర్ 819)లో విస్తరించి ఉంది. 2014 వరకు ఇక్కడ ఎలాంటి ఆక్రమణలు జరగలేదు. ఆ తర్వాత చెరువు పూర్తిగా అక్రమార్కుల చేతుల్లోకి పోయి ఆనవాళ్లు కోల్పోయింది. ఇక్కడ పదికిపైగా నిర్మాణాలు వెలిశాయి. హత్తిగూడలోని 5.35 ఎకరాల విస్తీర్ణంలోని హత్తికుంట(ఐడీ నంబర్ 797) 13 గుంటలకుపైగా కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. మన్నెగూడలో 11.22 ఎకరాల్లో విస్తరించిన గంగ రాయన్ చెరువులో ఇప్పటికే మూడు ఎకరాలకుపైగా కబ్జాకు గురైంది. బఫర్ జోన్‌లోనూ పలు నిర్మాణలు వెలిశాయి. కుంట్లూరు రెవెన్యూలోని ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలోని బడి కుంట ఇప్పటికే సగానికిపైగా కబ్జాకు గురైంది. హయత్‌నగర్ మండలం సాహెబ్‌నగర్‌కుర్దులోని 7.36 ఎకరాల్లో విస్తరించిన కుంట (ట్యాంక్ ఐడీ నంబర్ 259)లో ఇప్పటికే 4.06 ఎకరాలు కబ్జాకు గురైంది.

గండిపేటలో..

పుప్పాల్‌గూడలో 9.25 ఎకరాల్లో ఉన్న (ఐడీ నంబర్ 66)లోని కుంట 2014 వరకు ఎలాంటి ఆక్రమణలు లేవు. ఆ తర్వాత పూర్తిగా ఆక్రమణకు గురైంది. కుంట ఆనవాళ్లు పూర్తిగా లేకుండా చేసింది. ప్రస్తుతం ఈ స్థలంలో ఓ కార్పొరేట్ రియల్ ఎస్టేట్ కంపెనీ 50 అంతస్థులకుపైగా భారీ భవనాన్ని నిర్మిస్తోంది. పీరంచెరువులోని 1.16 ఎకరాల్లో విస్తరించి ఉన్న పిత్రుకుంట(ఐడీ నంబర్ 746) పూర్తిగా కబ్జాకు గురైంది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో భవనాలు వెలిశాయి. అలిజాపూర్‌లోని 0.82 విస్తీర్ణంలో విస్తరించిన కుంట(ఐడీ నంబర్ 627).. ప్రస్తుతం ఆనవాళ్లు లేకుండా పోయింది. పీరంచెరువులోని 3.14 ఎకరాల వడ్డెకుంట(ఐడీ నంబర్ 747) 26 శాతం కబ్జాకు గురైంది. 2014 లో ఇక్కడ ఎలాంటి ఆక్రమణలు లేవు కానీ ఆ తర్వాత చుట్టూ ప్రహరీ వెలిసింది. నీటి ఆనవాళ్లు లేకుండా చేశారు. బండ్లగూడ జాగీర్‌లోని (ట్యాంక్ ఐడీ నంబర్ 278) కుంట ఆనవాళ్లు కనుమరుగయ్యాయి. హైదర్షకోట్‌లోని 5.48 ఎకరాల విస్తీర్ణంలోని ఎర్రకుంటలో 2.35 ఎకరాలు ఇప్పటికే ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. 3.21 ఎకరాల గంధంగూడ చెరువులో ఇప్పటికే 1.25 ఎకరాలు కబ్జాకు గురైంది. 22 ఎకరాల్లో ఉన్న నెక్నంపూర్ చిన్నకుంటచెరువులో ఇప్పటికే పది ఎకరాలు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లింది. వీటిలో పలు నిర్మాణాలు సైతం వెలిశాయి.

శేరిలింగంపల్లిలో

గోపన్‌పల్లిలో 1.53 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న కుంట(ఐడీ నంబర్ 26) ప్రస్తుతం ఆనవాళ్లు లేకుండా పోయింది. గోదాంలు, పరిశ్రమలు వెలిశాయి. మియాపూర్‌లో 8.67 ఎకరాలు ఉండల్సిన చెరువు.. ప్రస్తుతం 76 శాతానికిపైగా కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. ఖాజాగూడలోని మూడు ఎకరాల విస్తీర్ణంలోని చెరువు సైతం కబ్జాకు గురైంది. మియాపూర్‌లో 30 ఎకరాల గురునాథ్ చెరువులో ఇప్పటికే పది ఎకరాలు కబ్జాకు గురైంది. మదీనాగూడలోని 33.37 ఎకరాల్లోని ఐర్లకుంటలో ఇప్పటికే నాలుగు ఎకరాలకుపైగా కబ్జాకు గురైంది.

బాలాపూర్‌లో..

మామిడిపల్లిలో 1.98 ఎకరాల్లో విస్తరించి ఉన్న మత్రివానికుంట (ఐడీ నంబర్ 268) పూర్తిగా కనుమరుగైంది. మీర్‌పేట్‌లోని 54.47 ఎకరాల విస్తీర్ణంలోని పెద్దచెరువు(ఐడీ నంబర్ 293) ఇప్పటికే 2.33 ఎకరాలు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లింది. మల్లాపూర్‌లోని 18 ఎకరాల విస్తీర్ణంలోని సుద్దవానికుంట(ట్యాంక్ ఐటీ నంబర్ 289)లో ఇప్పటికే 1.56 ఎకరాలు కబ్జాకు గురైంది. పాపయ్యకుందన్‌లో 4.16 ఎకరాల్లోని లింగాలకుంట(ట్యాంక్ ఐడీ నంబర్ 256)లో చాలా వరకు కబ్జాకు గురైంది. ఇదే మండల పరిధిలోని నాదర్‌గుల్‌లోని కండ్లకుంట (ట్యాంక్ ఐడీ నంబర్ 244) కబ్జాకు గురైంది. వెంకటాపూర్‌లో రెండు ఎకరాల్లోని అల్లకోని చెరువు 46 శాతం కబ్జాకు గురైంది. అదే విధంగా ఇబ్రహీంపట్నం మండలం ఆదిబట్లలో 12.4 ఎకరాల విస్తీర్ణంలోని ఎల్లమ్మబానికుంట(ట్యాంక్ నంబర్ 299)లో ఇప్పటికే రెండున్నర ఎకరాలకుపైగా కబ్జాకు గురైంది.

రాజేంద్రనగర్‌లో..

బుద్వేల్‌లో 6.39 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఓ కుంట(ఐడీ నంబర్ 183)...2014 వరకు ఎలాంటి ఆక్రమణలు లేవు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత పూర్తిగా కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. లక్ష్మీగూడలోని బాబుల్‌కుంట(ట్యాంక్ ఐడీ నంబర్ 176) సహా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్ద అంబర్‌పేటలోని మక్తల్‌కుంట(ట్యాంక్ ఐడీ నంబర్ 778)లో తొమ్మిది ఎకరాలకుపైగా కబ్జాకు గురైంది. 20 ఎకరాలకుపైగా విస్తరించి ఉన్న పల్లె చెరువులోని నూర్‌మహ్మద్ చెరువు 5.25 ఎకరాలు ఇప్పటికే కబ్జాకు గురైంది. గగన్‌పహాడ్‌లోని 37.24 ఎకరాల అప్పాచెరువు ఇప్పటికే 14 ఎకరాలు కబ్జాకు గురైంది. కాటేదాన్‌లోని 5.29 ఎకరాల పల్లె చెరువులో 3.17 ఎకరాలు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లింది.

మంచాల సీఐగా మధు



సీఐ మధును సన్మానిస్తున్న బీజేపీ శ్రేణులు

మంచాల: మంచాల ఠాణా సీఐగా ఎ.మధు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసని బాబ్యానాయక్ ఉప్పల్‌కు ట్రాఫిక్ సీఐగా బదిలీ అయ్యారు. దీంతో బాలాపూర్ పీఎస్‌లో డీఐగా పనిచేసిన మధును మంచాల సీఐగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన్ను బీజేపీ శక్తి కేంద్రం మండల ఇన్‌చార్జి పోలమోని భిక్షపతి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

పేదల సంక్షేమానికి సీఎం కృషి

మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి



మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న భీంభరత్ తదితరులు

మొయినాబాద్‌రూరల్: పేదల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నాడని శాసన మండలి చీఫ్ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్నం మహేందర్‌రెడ్డి తెలంగాణ శాసనమండలి చీఫ్ విప్‌గా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, దేవరంపల్లి మహేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, నాయకులు భిక్షపతి, కేబుల్‌రాజు తదితరులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేదల అభివృద్ధికి సంక్షేమ పథకాలు చేపడుతున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ మాజీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఈ-ఆఫీస్' ఫైల్స్‌కే స్పందన



జిల్లా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: ఈ-ఆఫీస్ విధానంలో వచ్చిన ఫైల్స్‌కు మాత్రమే స్పందిస్తామని కలెక్టర్ శశాంక అన్నారు. బుధవారం ఆయన కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. ఫైళ్ల విషయంలో చివరి నిమిషం వరకు ఆలస్యం చేసే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, సెక్షన్ అధికారులు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరిపాలన విషయంలో వ్యవహరించాల్సిన విధానాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ-ఫైల్ విధానంలో ట్రైనింగ్ తీసుకోకుండా.. టోకెన్లు అందుకోని అధికారులు త్వరితగతిన ఈ-ఆఫీస్ టోకెన్లు కొనుగోలు చేయాలన్నారు. ప్రతీ శాఖ మెయిలింగ్ నిర్వహణలోనూ అధికారిక ఇ-మెయిల్‌నే వాడాలని సూచించారు. జిల్లాలోని వివిధ శాఖల అధికారులకు, శాఖల సిబ్బందికి ఇప్పటికే ప్రాథమికంగా రెండు దఫాలుగా శిక్షణ పూర్తి చేశామన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ సంగీత, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, ఎస్‌సీ అధికారి స్వర్ణలత పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ పనుల వేగం పెంచండి

ప్రభుత్వం మంజూరు చేసిన మహేశ్వరం మెడికల్ కాలేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పల్లి సమీపంలో ఉన్న భారత్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న మహేశ్వరం మెడికల్ కాలేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. మెడికల్ కాలేజీలో జరగాల్సిన పనులు, అందుబాటులోకి తీసుకురావాల్సిన పరికరాలు, కళాశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు తదితర పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సిబ్బంది నియామకం, ల్యాబ్స్, హాస్టల్ వసతులు సమకూర్చుకోవాలని సూచించారు. సమన్వయంతో పనులు పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ వెంట ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

రైతుల శ్రేయస్సుకు ప్రాధాన్యం

గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి



పాలకవర్గ సమావేశంలో మట్లాడుతున్న చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: రైతుల శ్రేయస్సు ప్రాధాన్యత నిస్తూ మార్కెట్‌కు వచ్చే ప్రతీ రైతుకు న్యాయం చేసేందుకు పాలకవర్గంతో కలిసి పనిచేస్తానని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం బాటసింగారం పండ్ల మార్కెట్ కార్యాలయంలో మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన మొదటి పాలవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండ్ల మార్కెట్‌లో పనిచేసే హమాలీలను గుర్తించి లైసెన్స్ జారీ చేయాలని నిర్ణయించామన్నారు. గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ గొడుగు కిందున్న రైతు బజార్‌లతో పాటుగా ఎన్టీఆర్ నగర్ కూరగాయల మార్కెట్‌కు వచ్చే రైతుల సమస్యలు పరిష్కరించేందుకు వారితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశం అనంతరం మార్కెట్ ఆవరణలో మహిళా ఉద్యోగులు ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబురాల్లో నూతన పాలకవర్గం పాల్గొంది. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితుడు, సింగిల్ విండో చైర్మన్ చామ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్ చారి, మార్కెట్ డైరెక్టర్లు జైపాల్‌రెడ్డి, అంజయ్య, మేకం లక్ష్మి, మచ్చేందర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, గణేశ్ నాయక్, నర్సింహా, బండి మధుసూదన్‌రావు, నవరాజ్, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్ గుప్తా, ఇబ్రహీం, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్ పలువురు అధికారులు పాల్గొన్నారు.



కొత్తూరు: భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: పేదల ఆరోగ్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొందుర్గు, ఫరూఖ్‌నగర్, కేశంపేట, కొత్తూరు, నందిగామ, షాద్‌నగర్ పట్టణానికి చెందిన 76 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.19.39లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేదల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల స్థాయిని పెంచడంతో పాటు, మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నయ్య, తిరుపతిరెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, కృష్ణారెడ్డి, బస్వం తదితరులు పాల్గొన్నారు.

రూ.3.5 కోట్లతో అదనపు తరగతి గదులు

కొత్తూరు: విద్యాప్రమాణాల పెంపునకు ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలిక హాస్టల్ ఆవరణలో అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ.3.5కోట్లతో ఎస్ఎస్ఏ నిధులతో అదనపు తరగదుల నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. నిర్మాణంలో నాణ్యత పాటిస్తూ.. గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది లోపే ఉపాధ్యాయుల నియామకం చేపట్టిందన్నారు. అక్షరాస్యత శాతాన్ని పెంచడంతో పాటు గ్రామీణ స్థాయిలో విద్యాప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మారుతున్న కాలానుగుణంగా పాఠశాల విద్యలో మార్పులు అవసరమన్నారు. విద్యార్థులు సైతం చదువుల్లో ఉన్నతంగా రాణించాలని కోరారు. చదువుకున్న వారికే భవిష్యత్ ఉంటుందనే విషయాన్ని విద్యార్థులు గ్రహించాలన్నారు. అనంతరం స్థానిక గిరిజన నాయకులు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను తమ ప్రాంత అభివృద్ధికే కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌ముదిరాజ్, హరినాథ్‌రెడ్డి, సురేందర్, మహేందర్, శ్రీను, నర్సింహ, సత్తయ్య, గోవింద్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మడిగెలకు మోక్షమెప్పుడో!

రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన మడిగెలు ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఇంజనీరింగ్ విభాగం నిర్లక్ష్యం కారణంగా కొన్ని పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో మార్కెట్ ఆదాయానికి గండిపడుతోంది.

- రెండేళ్ల క్రితం పనులు ప్రారంభం
- నిర్మాణం పూర్తైన నిరుపయోగంగానే
- మార్కెట్ ఆదాయానికి గండి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్‌లో 2022లో రూ.1.25కోట్లతో 17 మడిగెలు నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. విద్యుత్ తదితర పనులు పెండింగ్‌లో ఉండడంతో ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఈ మడిగెలను మార్కెట్ శాఖకు అప్పగించలేదు. మార్కెట్ ఆధీనంలోకి తీసుకుంటే ప్రతీ నెల సుమారు రూ.4లక్షల వరకు కొత్త మార్కెట్ ఖాతాలో జమయ్యే అవకాశం ఉంది.

టెండర్లకు ఎదురుచూపులు

గతంలో రెండు దఫాలుగా ఈ మార్కెట్ యార్డులో నిర్మించిన 53 మడిగెలకు అప్పటి వేలం ప్రక్రియ ప్రకారం ప్రతీ నెల రూ.5 లక్షల వరకు అద్దె రూపంలో ఆదాయం వస్తుండేది. కొత్త మడిగెలకు టెండర్లు ఆహ్వానిస్తే ఒక్కో మడిగె రూ.20వేల నుంచి రూ.25వేల వరకు ప్రతీ అద్దె రూపంలో వచ్చే అవకాశం ఉంది. ఆదాయం వచ్చే మార్గం ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో మడిగెలు నిరుపయోగంగా మారాయి. ఈ టెండర్లు ఎప్పుడు ఆహ్వానిస్తారోనని పలువురు వ్యాపారస్తులు ఎదురు చూస్తున్నారు. మార్కెట్ శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి త్వరితగతిన పనులు పూర్తి చేసి మడిగెలను అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో అలంకార ప్రాయంగా ఉన్న మడిగెలు

త్వరలో ప్రారంభిస్తాం



మార్కెట్ యార్డులో మడిగెల నిర్మాణాన్ని చేపట్టాం. నిర్మాణాలు పూర్తైనప్పటికీ మరి కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఈ మడిగెలను తమకు అప్పగించిన వెంటనే ఆన్‌లైన్‌లో టెండర్ల ప్రక్రియను చేపడతాం. విద్యుత్ మీటర్ల ఏర్పాటుకు ఇప్పటికే డబ్బురూపంలో డీడీ కట్టాం. రోడ్డు మధ్యలో మడిగెల ఎదుట ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్లను మార్పిస్తాం.

– సంతోష్‌కుమార్, కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ యార్డు, ఇబ్రహీంపట్నం


ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



దుర్గామాత పూజలో జైపాల్‌యాదవ్ తదితరులు

తలకొండపల్లి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని మాదాయిపల్లిలో ఏర్పాటు చేసిన దుర్గామాత బుధవారం సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వగా జైపాల్ యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడిపంటలు, సుఖశాంతులతో నియోజకవర్గ ప్రజలు వర్ధిల్లేలా ఆశీర్వదించాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, జెడ్పీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ ముజీబర్ రహ్మాన్, మాజీ సర్పంచ్ ఎల్ఎస్ రెడ్డి, లక్ష్మీనారాయణ, మోహన్‌లాల్, వెంకటయ్య, బాలస్వామి, శ్రీను, రవి, సత్యం, మాధవులు తదితరులు పాల్గొన్నారు.



సరస్వతీ దేవిగా జూబ్లీహిల్స్ పెద్దమ్మ

సరస్వతీ దేవిగా జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి వేకువజామునే అభిషేకం, అర్చన, హోమం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

– బంజారాహిల్స్

కాంగ్రెస్‌పై ప్రతిపక్షాల దుష్ప్రచారం

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అందిస్తుంటే ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల, కడ్తాల్ మండల వాసులకు మంజూరైన సీఎంఆర్ ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. నిరుద్యోగులకు మేలు చేకూరేలా ఎప్పటిఎప్పుడు ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియ కొనసాగిస్తున్నామన్నారు. సంక్షేమ పథకాల పటిష్టకు ఫ్యామిటీ డిజిటల్ కార్డులు రూపొందిస్తుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ ఆమనగల్లు మండల అధ్యక్షుడు జగన్, పార్టీ నాయకులు ఖాదర్, మెకానిక్ బాబా తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

వేర్వేరు చోట్ల రెండు మృతదేహాలు

- అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్ పరిధిలో వెలుగులోకి..
- శవాలను ఉస్మానియా మార్చురీకి తరలించిన పోలీసులు

అబ్దుల్లాపూర్‌మెట్: వేర్వేరు చోట్ల రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ శివారులోని గండిమైసమ్మ ఆలయ సమీపంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద ఓ వ్యక్తి మృతదేహం ఉందనే సమాచారం మేరకు.. పోలీసులు అక్కడకు వెళ్లి పరిశీలించారు. మృతుడికి సుమారు 50– 55 సంవత్సరాల వయస్సు ఉంటుంది. ఇతనికి సంబంధించిన వివరాలేవీ తెలియరాలేదు. మృతుడు యాచకుడై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో మహిళ మృతదేహం

బాటసింగారం పరిధిలోని ఓ పౌల్ట్రీ ఫాం సమీపాన పాడుబడిన బావిలో పడి మహిళ మృతిచెందినట్లు డయల్ 100కి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతురాలి వయస్సు 40– 45 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. ఈమె కూడా యాచకురాలై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి, రెండు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి

రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్



దుర్గామాత పూజలో జ్ఞానేశ్వర్, భీంభరత్, జైపాల్‌రెడ్డి తదితరులు

మొయినాబాద్‌రూరల్: ప్రజలు భక్తి భావాన్ని పెంపొందిచుకోవాలని రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్, కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త జైపాల్‌రెడ్డి అన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు సరస్వతీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అజీజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో వారు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాణయ్య, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణం నిలిపిన 108 సిబ్బంది

మీర్‌పేట: అర్ధరాత్రి రోడ్డుపై కుప్పకూలిన ఆటో డ్రైవర్‌కు సీపీఆర్ చేసి ప్రాణం కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఈసీఐఎల్‌కు చెందిన ట్రాలీఆటో డ్రైవర్ శ్రీను (26) మంగళవారం మల్లాపూర్‌లోని బంధువుల ఇంటికి వచ్చాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత 1.40 గంటలకు మందమల్లమ్మ నుంచి బాలాపూర్ చౌరస్తా వైపు ఆటోలో వెళ్తుండగా డివైడర్ పక్కన ఆటోను ఆపి రోడ్డుపైనే కుప్పకూలిపోయాడు. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా, ఐదు నిమిషాల్లో అక్కడికి చేరుకున్న సిబ్బంది.. పల్స్ తక్కువగా ఉన్నట్లు గమనించారు. ఈఆర్‌సీపీ డాక్టర్ కేశిరెడ్డి సూచన మేరకు ఈఎంటీ ఏనుగు మహేశ్ అతనికి సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడాడు. అనంతరం మీర్‌పేట పోలీసుల సాయంతో శ్రీనును ఆస్పత్రికి తరలించారు. 108 అంబులెన్స్ పైలెట్ నర్సింహులు, ఈఎంటీ మహేశ్‌కు బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



శ్రీనుకు సీపీఆర్ చేస్తున్న 108 సిబ్బంది మహేశ్

'స్వాహా పర్వం'పై సమావేశం



డీసీసీబీ కేంద్ర కార్యాలయంలో బ్యాంకు మేనేజర్లతో సమావేశమైన చైర్మన్ సత్తయ్య, సీఈఓ సుబ్రహ్మణ్యం

యాచారం: 'రుణం.. స్వాహా పర్వం' శీర్షికతో బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనం డీసీసీబీ మేనేజర్లలో అలజడి సృష్టిస్తోంది. ఈ కథనానికి స్పందించిన డీసీసీబీ సీఈఓ సుబ్రహ్మణ్యం, ఓఎస్డీ సూర్యప్రకాశ్‌రావు ఉమ్మడి డీసీసీబీ బ్రాంచ్‌లలో పనిచేస్తున్న డీఎంలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో.. గ్రామీణ ప్రాంతాల్లోని బ్యాంకుల్లోనే ఎక్కువ అవకతవకలు జరుగుతున్నట్లు గుర్తించారు. ఇకనుంచి ఇలాంటివి సహించేది లేదని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. ఇకనుంచి ప్రతీ వారం బ్యాంకుల్లో తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.

యువత క్రీడలపై దృష్టి సారించాలి

రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ విజయ్‌కుమార్

మొయినాబాద్: గ్రామీణ ప్రాంత యువత క్రీడలపై సైతం దృష్టి సారించాలని రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ విజయ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం మొయినాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ పోలీస్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. మండల పరిధి నుంచి 14 జట్లు తలపడగా అజీజ్‌నగర్, రెడ్డిపల్లి జట్లు ఫైనల్‌కు చేరాయి. అజీజ్‌నగర్ జట్టు ప్రథమ స్థానంలో నిలవడంతో రూ.15వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన రెడ్డిపల్లి జట్టుకు రూ.పదివేలు, తృతీయ స్థానంలో నిలిచిన చందానగర్ జట్టుకు రూ.5వేలు, కనకమామిడి జట్టుకు ప్రోత్సాహక బహుమతిగా రూ.2,500 నగదు బహుమతితో పాటుగా షీల్డులు అందజేశారు. బహుమతులు అందజేసిన అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ.. యువత సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ ముజాఫర్ అలీ, కేజీరెడ్డి కళాశాల ఏఓ రవికిరణ్‌రెడ్డి, కానిస్టేబుల్స్ నర్సింహ, మహేశ్వర్‌రెడ్డి, బద్రి, ఈర్షత్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



ఫ్రెండ్లీ పోలీస్ వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న విజయ్‌కుమార్

మెరుగైన విపత్తు నిర్వహణ ఎలా?

దృష్టి పెట్టిన హైడ్రా కమిషనర్ రంగనాథ్



సమావేశమైన హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితరులు

- వివిధ రాష్ట్రాల్లోని విధానాలు అధ్యయనం
- విస్తృత స్థాయి సమీక్షలో పాల్గొన్న అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వర్షాలు, వరదల సందర్భాల్లో చేపట్టాల్సిన విపత్తు నిర్వహణ చర్యలపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) దృష్టి పెట్టింది. మెరుగైన విధానాన్ని అమలు చేయడానికి వివిధ రాష్ట్రాల్లో అమలులో ఉన్నవి అధ్యయనం చేస్తోంది. ఇందులో భాగంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం కర్ణాటక రాష్ట్ర ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ కేంద్రం మాజీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ శ్రీనివాస్‌రెడ్డితో భేటీ అయ్యారు. బుద్ధ భవన్‌లోని హైడ్రా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో విపత్తు నిర్వహణకు సంబంధించి బెంగళూరులో అనుసరిస్తున్న విధానాలపై శ్రీనివాస్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

◆ దేశంలోని ఇతర నగరాలు, పట్టణాల్లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసి, మెరుగైన వ్యవస్థను రూపొందించడంపై అధికారులు దృష్టి పెట్టారు. కాగా.. మెరుగైన విపత్తు నిర్వహణతో పాటు ప్రజలను అప్రమత్తం చేసే వ్యవస్థ ఏర్పాటుపై రంగనాథ్ దృష్టి పెట్టారు. వాతావరణ కాలుష్యం, ఇతర కారణాలతో నెలలో పడాల్సి వర్షం.. ఒక్క రోజులో పడాల్సింది గంట, అరగంటలో కురుస్తుండటంతో తలెత్తుతున్న తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవడంపై హైడ్రా దృష్టి పెట్టింది. అనునిత్యం ప్రాంతాల వారీగా వాతావరణ నివేదిక ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని, ఎంత వర్షం పడుతుందో, వరద ముప్పు, వడగళ్లతో పాటు పిడుగుపాట్ల హెచ్చరికలు కూడా ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది.

సమాచార సేకరణ ఎప్పటికప్పుడు..

◆ గ్రేటర్ పరిధిలో డివిజన్ల వారీగా వాతావరణ స్టేషన్ల నుంచి సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి క్రోడీకరిస్తూ వర్షపాత నమోదును, వరద ముప్పును అంచనా వేసి ప్రజలను అప్రమత్తం చేయడానికి కసరత్తు చేస్తోంది. రహదారుల్లో వర్షపు నీరు నిలిచిపోకుండా, ప్రవహించకుండా ఎక్కడికక్కడ వరద నీటి కాల్వల్లోకి వెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వరదలు, ముంపు సంభవిస్తుందనే విషయం గ్రహిస్తూ అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం పైనా హైడ్రా అధికారులు దృష్టి పెట్టారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో వరద నీటి కాలువల ప్రవాహ స్థాయిని అంచనా వేసేందుకు బెంగళూరులో సెన్సార్లు అమర్చారు. వాటి పరితీరును అధ్యయనం చేయడంతో పాటు నాలాల్లో చెత్త పేరుకుపోకుండా చర్యలను హైడ్రా చర్యలు తీసుకోనుంది. ప్రస్తుతం నగరంలో ఉన్న చెరువులకు అలుగులు ఉండేలా.. చెరువు నిండిన తర్వాత నీరు అలుగు ద్వారా ఇంకో చెరువుకు వెళ్లేలా గొలుసు కట్టు చెరువుల లింకును పునరుద్ధరించడం ద్వారా వరద నీరు ముందుకు వెళ్లేలా చర్యలు తీసుకోవడానికి సిద్ధమవుతున్నారు.

కేటీఆర్, హరీశ్‌రావులకు మంచి బుద్ధి ప్రసాదించాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



కనకదుర్గ దేవాలయంలో పూజలు చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఎల్‌బీనగర్: మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులకు దుర్గామాత మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరుకుంటున్నానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజలకు సద్దుల బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం మంత్రి వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లోని శ్రీ కనకదుర్గమ్మ దేవాలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత 50 ఏళ్లలో ఎన్నడూ లేనివిధంగా హైదరాబాద్ నగరాభివృద్ధి కోసం జీహెచ్ఎంసీకి రూ.10వేల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 10 నెలల్లోనే 70 వేల ఉద్యోగాలు కల్పించిందన్నారు. సమావేశంలో రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, దేవాలయ చైర్మన్ సంరెడ్డి భుజంగరెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యమివ్వాలి

లక్డీకాపూల్: ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించే విధుల్లో నిమగ్నమై ఉండే పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు, సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలని సఫాయీ కర్మచారి జాతీయ కమిషన్ సభ్యులు డాక్టర్ పి.పి.వావా సూచించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఆయన జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, ఆయా విభాగాల అధికారులు, వాల్మీకి అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. పారిశుద్ధ్య కార్మికులకు అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపరిశుభ్ర వాతావరణంలో విధులు నిర్వర్తించే పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు, సంక్షేమానికి పెద్దపీట వేయాలన్నారు. క్రమం తప్పకుండా వారికి ప్రత్యేకంగా ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి ఉచిత వైద్య సేవలు అందించాలని సూచించారు. కనీస వేతనాలు అమలయ్యేలా పర్యవేక్షణ జరపాలని, బీమా సౌకర్యం, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు వర్తించేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా వాల్మీకి సమాజం ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయా ప్రతినిధులు కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో కమిషన్ సలహాదారు వీరేంద్రనాథ్, అడిషనల్ కమిషనర్లు రఘుప్రసాద్, పంకజ, నళినీ పద్మావతి, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అపూర్వ చౌహాన్, రవి కిరణ్, ఉపేందర్ రెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.